క్లుప్తంగా

మసీదులో బోర్ వేయించిన కాటసాని ఓబులరెడ్డి


బోరు వేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని బీసీ కాలనీలోని మసీదులో ఎమ్మెల్యే కాట సాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి సొంత నిధులతో శుక్రవారం బోరు వేయించారు. ఈ మసీదులో నెలకొన్న నీటి సమస్యను కాలనీకి చెందిన షేక్షా, షాషా, ముక్తియార్ తదితరులు ఇటీవల కాటసాని ఓబులరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన బోరు వేయించారు. నీరు సమృద్ధిగా పడడంతో కాటసాని ఓబులరెడ్డికి కాలనీకి చెందిన ముస్లిం సోదరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మద్దతుదారులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు షేక్షా, షాషా, ముక్తియార్ పేర్కొన్నారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన గుర్రాల కూల్లాయప్ప విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం మృతిని కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ధరణి, సర్పంచ్ గుర్క కృష్ణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిపిరెడ్డి నాగిరెడ్డి, కప్పెట వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు అందజేశారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న రామ్‌కో ప్రాజెక్ట్ హెడ్ రెడ్డి నాగరాజు

కొలిమిగుండ్ల: మహిళలు స్థానికంగానే స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని రామ్‌కో సిమెంట్ ప్రాజెక్ట్ హెడ్ రెడ్డి నాగరాజు సూచించారు. శుక్రవారం కొలిమిగుండ్లలో కల్వటాల, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె, పెట్నికోట, నాయినపల్లె, మీర్జాపురం, చింతలాయిపల్లె గ్రామాలకు చెందిన 75 మంది మహిళలకు మగ్గం,ఆహార పదార్థాల తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా రెడ్డి నాగరాజు మాట్లాడుతూ కంపెనీ సామాజిక బాధ్యతగా కింద చుట్టు పక్కల గ్రామాలే అభివృద్ధే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. శిక్షణా కాలం పూర్తి అయ్యాక మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రామ్‌కో ప్రెసిడెంట్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి


మురుగు కాల్వలు పరిశీలిస్తున్న కామేశ్వరరావు

బనగానపల్లెరూరల్: పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె పట్టణంలోని సచివాయం-3 పరిధిలో జరుగుతున్న కార్యక్రమాన్ని కామేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ఉన్న మురికి కాల్వల పరిశీలనతో పాటు ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న మంచినీటి ట్యాంకు పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ వరప్రసాద రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రత్నాచారి, ఏఎన్ఎం నాగేశ్వరమ్మ, వలంటీర్ల, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు

ప్యాపిలి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక ప్రయోజనాలు ఉన్నాయని ఊటకొండ ఎంపీటీసీ మద్దయ్య, ఎస్ఎఫ్ఐసీఆర్పీ రవీంద్ర అన్నారు. మండల పరిధిలోని ఊటకొండ సచివాలయంలో శుక్రవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను విరివిగా వాడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రైతులు దస్తగిరి, కళ్యాణ్‌కుమార్, సంపత్ కుమార్, రాజేశ్, ఓబులేసు, శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

డోన్ రూరల్ : పట్టణంలోని పాతబస్టాండ్ నందు వెలసిన శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు నారాయణ స్వామి భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఈ చిత్రంలో పింఛన్ అందుకుంటున్న వితంతువు పూజారి వరలక్ష్మీ బనగానపల్లె పట్టణం, రవికిరణ్ పబ్లిక్ స్కూల్ ఏరియాలో నివాసం ఉంటుంది. దాదాపు 20 ఏళ్లక్రితం భర్త మృతి చెందాడు. గత ప్రభుత్వంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. దీంతో నిరాశకు గురైంది. అర్హతలను గుర్తించిన వలంటీర్ వితంతువును సంప్రదించి ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు పింఛన్ మంజూరైంది. కనీసం కార్యాలయం వద్దకు కూడా వెళ్లకుండాలనే పింఛన్ మంజూరైందని పూజారి వరలక్ష్మీ ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. శుక్రవారం పింఛన్ సొమ్ము రూ.2750 తీసుకున్న ఆమె సీఎం వైఎస్ జగన్‌తోపాటు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



పింఛన్ నగదు అందుకుంటున్న బాలుడు పేరు నరసింహ. మహానంది మండలం తిమ్మాపురంకు చెందిన పాల ఏసు జీవనోపాధి నిమిత్తం 18 ఏళ్ల క్రితం కుటుంబంతో కలిసి కొలిమిగుండ్ల మండలం రాఘవరాజుపల్లె సమీపంలోని పాలీష్ ఫ్యాక్టరీలో స్థిరపడ్డాడు. ఐదుమంది సంతానంలో 12 ఏళ్ల పెద్ద కుమారుడు నరసింహకు పుట్టుకతోనే మూగ, చెవిటి కావడంతో మాటలు రావు. రేషన్, ఆధార్ కార్డులు లేవు. వలంటీర్ విజయ్ కుమార్ ఆకుటుంబానికి రెండు నెలల క్రితం రేషన్, ఆధార్ కార్డులు వచ్చేలా కృషి చేశాడు. నరసింహను సదరం క్యాంపునకు తీసుకెళ్లి సర్టిఫికెట్ తీసుకున్నారు. జూన్‌లో పింఛన్ కోసం దరఖాస్తు చేయించగా మంజూరు కావడంతో వలంటీర్ నగదు అందజేశారు. వలంటీర్ సాయం మరుమంటూ లబ్ధిదారుడితోపాటు ఆ కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఈ చిత్రంలో పసిపిల్లలా కనిపిస్తున్న చంద్రిక వయసు 11 సంవత్సరాలు. అవుకు పట్టణం ఎస్సీ కాలనీకి చెందిన మట్ట కేశాలు, మట్ట మరియమ్మ దంపతుల రెండవ కుమార్తె. పుట్టుకతోనే మతిస్థిమితం లేని చంద్రికను డాక్టర్లకు చూపించినా ఫలితం లేకుండా పోయింది. భర్త ఆటో నడుపుతుండగా భార్య కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో సదరమ్‌లో అంగవైకల్య సర్టిఫికేట్ ఇవ్వలేదు. పలుమార్లు అంగవైకల్యం పింఛన్‌కు అర్జీ చేసుకున్నా ప్రయోజనం చేకూరలేదు. ఇటీవలే చంద్రిక అంగవైకల్య సర్టిఫికెట్ దక్కింది. ఈ మేరకు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. ఈ మేరకు రూ.3వేలు పింఛన్ సొమ్ము అందుకున్న ఆ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. మా పాప జీవితానికి కొంతమేర భరోసా కల్పించిందని వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ 'భరోసా' పెంచెన్!

- 2,025 కొత్త పింఛన్లు మంజూరు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


అబ్బులాపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

బనగానపల్లె: వైఎస్సార్ పింఛన్ పంపిణీ పండుగలా సాగుతుంది. ప్రతినెలా ఒకటవ తేదీన వలంటీర్లు ఠంచన్‌గా అందజేస్తుండడంతో అన్నివర్గాల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సామాజిక పింఛన్ పథకం అభాగ్యుల జీవితాలకు భరోసా కల్పిస్తుంది. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పింఛన్ మంజూరు అవుతుండడంతో అన్నిసామాజిక వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల కొత్తగా మరో 2,025 మందికి వివిధ రకాల పింఛన్ మంజూరయ్యాయి. గతంలో 37,084 ఉండగా కొత్తగా మంజూరైన వాటితో కలిపి 39,109 చేరింది లబ్ధిదారుల సంఖ్య. అర్హులందిరికీ పింఛన్ మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ మండల కేంద్రం కొలిమిగుండ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వృద్ధాప్య, వితంతు, నేతకార్మికులు, మత్స్యకారులు తదితర లబ్ధిదారులకు రూ.2750, వికలాంగుల, ట్రాన్స్‌జెండర్స్, డప్పు కళాకారులు రూ.3వేలు, డయాలసిస్ రోగులకు రూ.10వేలు చొప్పున ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే.

టీడీపీ హయంలో తీవ్ర అవస్థలు

పింఛన్ మంజూరుకు టీడీపీ ప్రభుత్వ హయంలో తీవ్ర ఇబ్బందులు ఉండేవి. లబ్ధిదారులు సైతం పింఛన్ మొత్తం తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడేవారు. గ్రామ పంచాయతీ, చావిళ్లు, రచ్చబండల వద్ద పింఛన్ లబ్ధిదారులు నిరీక్షించాల్సిన దుస్థితి. ఒక్కోనెల 3-4 రోజులు పడిగాపులు కాసేవారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి చెక్ పెట్టారు. ఇళ్ల వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేస్తుండడంతో లబ్ధిదారుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా పింఛన్ వివరాలు

మండలం	పాతపింఛన్లు	కొత్త పింఛన్లు
బనగానపల్లె	12,357	685
కోవెలకుంట్ల	5,898	322
కొలిమిగుండ్ల	6,987	385
అవుకు	6,662	375
సంజామల	5,182	258

సిమెంట్ నగర్ గ్రామంలో టీడీపీ నాయకుడికి పింఛన్ అందజేత



సిమెంట్ నగర్‌లో టీడీపీ నాయకుడు మస్తాన్ వలీకి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అందుకు నిదర్శనంగా సిమెంట్ నగర్ గ్రామంలో టీడీపీ నాయకుడు మస్తాన్ వలీకి వృద్ధాప్య పింఛన్ మంజూరు కావడమే. ఈ మేరకు శుక్రవారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు యాకోబ్, సత్యం, ఈఓ ఆధ్వర్యంలో లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేశారు.

వెల్లువెత్తిన ఆనందం


పింఛన్ అందజేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్


పింఛన్ సొమ్ము అందజేస్తున్న సప్తశైల రాజేష్

డోన్ : పింఛన్ లబ్ధిదారుల ఆనందం వెల్లువెత్తింది. డోన్ నియోజకవర్గానికి కొత్తగా వివిధ రకాల 1,608 పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నియోజకవర్గ వ్యాప్తంగా 31739 మంది పింఛన్‌లు ఉండగా, కొత్తవి 1608తో కలిపి ఈ సంఖ్య 33,347 మందికి చేరింది. డోన్ గ్రామీణ ప్రాంతంలో పాత పింఛన్లు 7448 ఉండగా, కొత్తగా 472 మంజూరయ్యాయి. పట్టణ పరిధిలో 5447 పాత పింఛన్లు ఉండగా, 221 కొత్తగా మంజూరయ్యాయి. బేతంచెర్ల గ్రామీణ ప్రాంతాల పరిధిలో 6,067 పాత పింఛన్లు ఉండగా, 333 కొత్తగా మంజూరయ్యాయి. పట్టణ పరిధిలో 4106 పాత పింఛన్లు ఉండగా, అదనంగా మరో 88 మందికి కొత్తగా మంజూరయ్యాయి. ప్యాపిలి మండలంలో 8671 పాత పింఛన్లు ఉండగా, 494 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. పింఛన్ సొమ్ము అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.







పింఛన్ నగదు అందజేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్, అంతిమేని వరలక్ష్మికి కొత్త పెన్షన్‌ను అందజేస్తున్న దృశ్యం, పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఏపీఐఐసీ డైరెక్టర్, పుత్తూరి సూజాతకు పింఛన్ అందజేస్తున్న మల్కిరెడ్డి వెంకట సుబ్బరెడి, వెలగటూరులో ఫించన్ అందజేస్తున్న ఎల్వీ సుధాకర్‌రెడ్డి

అభివృద్ధి పనులను తనిఖీ చేసిన మంత్రి బుగ్గన


క్లబ్ హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

డోన్ : ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. బేతంచెర్ల బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముగించుకొని డోన్‌కు వచ్చిన మంత్రి రూ. 40కోట్లతో గుత్తి రోడ్లు పక్కన నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా పాతస్టాండ్ వద్ద రూ.16కోట్లతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్, రైల్వే స్టేషన్‌లో రూ3.కోట్లతో నిర్మిస్తున్న క్లబ్ హౌస్ నిర్మాణ పనులను మంత్రి తనిఖీ చేసి త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబదిత అధికారులు, కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ నూతన భవన ఆవరణను పరిశీలించి ఇక్కడ పార్కును ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ను ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి మున్సిపల్ డీఈ రసూల్ తదితరులు ఉన్నారు.

వర్షాభావ పరిస్థితులను అధిగమించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సరళమ్మ

కోవెలకుంట్ల: వర్షాభావ పరిస్థితులను అధిగమించాలని, బెట్టబోయిన పంటలను అధికారుల సూచనల మేరకు కాపాడుకోవాలని నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్ర ఏడీఏలు మంజువాణి, సరళమ్మ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఆయా మండలాల్లో రైతులు మొక్కజొన్న, మినుము, కంది, పత్తి, వేరుశనగ, పొద్దుతిరుగుడు, పెసర, ఆముదం, తదితర పంటలు సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో పైర్లు ఎండు దశకు చేరుకుంటున్నాయన్నారు. బెట్టబారి నుంచి పైర్లను కాపాడుకునేందుకు లీటరు నీటికి 20 గ్రాముల డీఏపీ, 10 గ్రాముల పొటాషియం క్లోరైడ్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు నిరంజన్, చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఆర్చీ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో దాతల సహకారంతో ఇటీవల మారెమ్మ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించారు. ఈ మేరకు ఆలయ ఆర్చీ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. పట్టణానికి చెందిన చిన్నవ్యాపారుల సంఘం అధ్యక్షుడు లింగన్న తన భార్య పుల్లమ్మ జ్ఞాపకార్థం రూ. 2 లక్షలతో ఆర్చీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, ఏపీ ఎన్‌జీఓల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు శివశంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఇంజినీర్ మధుబాబు, ఆలయ కమిటీ సభ్యులు ఉసేనప్ప, మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

డోన్ రూరల్ : కర్నూలులో ఈనెల 16,17వ తేదీన ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మోటార్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం డ్రైవర్లకు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు కొండయ్య, ఎర్రన్న, మధు, జనార్ధన్‌గౌడ్, ఆర్‌సీ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇష్టంతో చదవండి


విద్యార్థులు, అధ్యాపకులకు అభివాదం చేస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: మీ తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సూచించారు. మండలానికి పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడమే కాకుండా ఈఏడాది తరగతులు ప్రారంభం కావడంతో రహదారి వెంట మంత్రి బుగ్గన కాన్వాయ్‌కి విద్యార్థులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గనకు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. కాన్వాయ్ దిగివచ్చిన మంత్రి బుగ్గన, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి విద్యార్థులు, ప్రిన్సిపాల్ రాజేష్, అధ్యాపకులతో ముచ్చటించారు. శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులు, క్రమశిక్షణతో కూడిన విద్య బోధించాలని అధ్యాపకులకు మంత్రి సూచించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని బోయపేట కాలనీకి చెందిన నబీరసూల్ (56) గత నెల 27వ తేదిన డోన్ క్రాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోయించుకొని వస్తుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. చికిత్సపొందుతూ కోలుకోలేక శుక్రవారం మరణించాడు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.

మహిళపై కత్తితో దాడి

సంజామల: మండలం పరిధిలోని రెడ్డిపల్లె గ్రామానికి తోక నాగేంద్రమ్మపై కత్తితో దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు తోక నాగేంద్రమ్మ పొలం నుంచి వస్తుండగా గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన సింగరం నరసింహులు, సింగరం పుల్లయ్య మా పొలంలోకి ఎందుకు పోయావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ వీపుపై ఓ సారి కత్తితో దాడి చేశారు. అంతలోనే అటునుంచి రాంకోజీపు వస్తుందని గమనించి చంపుతామని బెదిరించి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా ఊట ధ్వంసం

అవుకు: మండల పరిధిలోని గడ్డమేకులపల్లె గ్రామ శివారుల్లో టాస్క్ ఫోర్స్ టీమ్ లక్ష్మణ్ దాస్, ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. నాలుగు సారా బట్టీలను, తయారీకి వినియోగించిన సామగ్రిని ధ్వంసం చేశామని సెబ్ ఎస్ఐ దౌలత్ ఖాన్ తెలిపారు. డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సారా ఊటను పారబోసి, నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

అవుకు: అవుకు పట్టణానికి సమీపాన ఉప్పలపాడు ఆర్చీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అవుకు మండలం చెన్నంపల్లె, కోనాపురం గ్రామాలకు చెందిన ఎనిమిదిమంది వివాహ వేడుకలను ముగించుకొని స్కార్పియోలో తాడిపత్రి వైపు నుంచి వస్తున్నారు. ఉప్పలపాడు ఆర్చీ వద్దకు రాగానే ఓ మోటార్ సైకిల్ హఠాత్తుగా రావడంతో తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టారు. మోటర్ సైకిల్ స్కార్పియో వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న వ్యక్తితోపాటు స్కార్పియో వాహనంలో ఉన్న చెన్నంపల్లె గ్రామానికి చెందిన నలుగురికి రక్త గాయాలయ్యాయి. ఎస్ఐ నరేంద్ర సంఘటన స్థలానికి చేరుకొని క్షతగ్రాతులను సమీప ఆసుపత్రికి తరలించారు. మహేశ్వరి, సుదర్శన్ రెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఏపీ బిల్డర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల వెంకట్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు వినతి పత్రం అందజేశారు.

నాణ్యత పాటించాలి

కొలిమిగుండ్ల: జగనన్న గోరుముద్దలో నాణ్యత పాటించాలని ఎంఈఓ రాజయ్య సూచించారు. శుక్రవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించారు. భోజనం రుచి చూశారు. మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

బనగానపల్లె : పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద శుక్రవారం కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన 11 టీడీపీ మద్దతు కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గడ్డం బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, బాలు, మద్దిలేటి, ఆదినారాయణ, రాముడు, నాగయ్య, రామచంద్రుడు రామసుబ్బయ్య, మరి కొందరు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన 50 నెలలలో అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాల పట్ల ఆకర్షితులై టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సత్తార్, ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.

ముస్లిం సమస్యల పరిష్కారానికి కృషి


ముస్లిం సోదరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని ముస్లింల సమస్యల పరిష్కారానికి తనవంతు పూర్తిసహకారం అందిస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని స్వగృహంలో ఎమ్మెల్యేను ముస్లిం మైనార్టీ నాయకులు కలిశారు. వివిధ సమస్యలు విన్నవించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. దశలవారీగా కాలనీల్లో అభివృద్ధి పనులతో పాటు సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుటామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంతగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని గుర్తు చేశారు. పట్టణంలో ముస్లింల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతోపాటు తన సొంత నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే కాటసాని వివరించారు. యాగంటిపల్లె రహదారిలో నూతనంగా రూ.1.30 కోట్లతో ముస్లింలకు షాదీఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర షేక్ ముస్లిం కార్పోరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్‌తో పాటు పలువురు ముస్లిం నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్ మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్‌తో పాటు పలువురు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ల ఆధునికీకరణకు ప్రాధాన్యత


సమావేశంలో మాట్లాడుతున్నఆర్టీసీ ఎండీ ద్వారాకా తిరుమల రావు

బేతంచెర్ల: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు, డిపోల ఆధునికీకరణతో పాటు కొత్త బస్సులను ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారాకా తిరుమల రావు అన్నారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రారంభోత్సవానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తో కలిసి ఆర్టీసీ ఎండీ ద్వారాకా తిరుమల రావు హాజరయ్యారు. ఈసందర్భంగాఆర్టీసీ ఎండీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1500 డీజల్ బస్సులు, 1000 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ నంద్యాల డీపీటీవో శ్రీనివాసులు, బనగానపల్లె, డోన్, కోవెల కుంట్ల డిపో మేనేజర్లు శశిభూషణ్ రావు, తిరుపతయ్య, రవి కిశోర్, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి, వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లు, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి


డోన్‌లో ఓటర్ వెరిఫికేషన్‌ను ప్రక్రియను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ : అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలని, 18 ఏళ్లు పైబడిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటర్ జాబితాలో ఉండేలా సరిచూసుకోవాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. డోన్ పాతపేట 115, 116 పోలింగ్‌బూత్‌లతో పాటు మండలంలోని చింతలపేట, కొచ్చెర్వు గ్రామాలలోని పోలింగ్‌బూత్‌లను ఆర్డీఓ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో ఓటుర జాబితా నుంచి తొలగించి ఉంటే పునః పరిశీలించి చేర్చేందుకు ఇంటింటికీ రీసర్వేను పకడ్బందీగా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఫారం 6, 7 మరియు 8లను కూడా క్షేత్రస్థాయిలో ఎలా పరిశీలించాలనే విషయాన్ని బీఎల్‌ఓలకు సూచించారు.